

తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తన జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవెల్లిలోని నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డిని కేసీఆర్ ఆశీర్వదించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# లైడిటెక్టర్ టెస్ట్‌కు సీఎం సిద్ధమా?

మొదటిపేజీ తరువాయి...

పేరుతో ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకునేందుకు కుట్ర చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### చట్టాన్ని గౌరవించే పౌరుడిగా వస్తా..

తనకు ఎన్నిసార్లు నోటీసులిచ్చినా, విచారణ పేరుతో సాగదీసినా ఫార్ములా ఈ అంశం సంపూర్ణ పారదర్శకంగా జరిగిందని, ఈ విషయం అందరికీ తెలుసునని కేటీఆర్ తెలిపారు. తాజాగా మరోసారి ఇదే అంశంలో ఏసీబీ తనకు నోటీసులిచ్చిందని తెలిపిన కేటీఆర్, చట్టాలను గౌరవించే పౌరుడిగా, తప్పకుండా సోమవారం ఉదయం 10 గంటలకు ఏసీబీ విచారణకు హాజరై అన్ని విధాలుగా సహకరిస్తానని స్పష్టంచేశారు.

### లైవ్‌లో.. లైడిటెక్టర్‌కు సిద్ధమా?

పదేండ్ల క్రితం నోటుకు ఓటు కుంభకోణంలో నోట్లకట్టలున్న నల్లబ్యాగుతో రేవంత్‌రెడ్డి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారని, ఆ కేసు కూడా ఇదే ఏసీబీ పరిధిలో పెండింగ్‌లో ఉన్నదన్ని కేటీఆర్ గుర్తుచేశారు. 'ఇద్దరిపైనా ఏసీబీ కేసులున్నాయి.. ఇద్దరిలో దోషులెవరో, నిర్దోషులెవరో తేల్చేందుకు జడ్జి సమక్షంలో లైవ్ టెలివిజన్ సాక్షిగా లైడిటె క్టర్ టెస్టును ఎదుర్కొనే దమ్మూ, ధైర్యం రేవంత్‌రెడ్డికి ఉన్నదా?' అని కేటీఆర్ సవాలు విసిరారు. 'లై డిటెక్టర్ టెస్టుకు నేను సిద్ధం, నువ్వు సిద్ధమా రేవంత్ రెడ్డీ' అని ప్రశ్నించారు. 'ఓవైపు మీ దివాలాకోరు విధానాలతో రాష్ట్ర ఖజానా ఖాళీ అని ముఖ్యమంత్రి అసమర్థతను చాటుకుంటున్న తరుణంలో విచారణల కోసం ప్రజాధనాన్ని వృథా చేయడం మానుకొని, వెంటనే లైడిటెక్టర్ టెస్టుకు సీఎం రేవంత్ సిద్ధం కావాలి' అని సవాల్ చేశారు.

> చట్టాలను గౌరవించే పౌరుడిగా ఏసీబీ విచారణకు హాజరవుత. విచారణకు సహకరిస్త. పదేండ్ల కింద నోటుకు ఓటు కుంభకోణంలో నోట్లకట్టలున్న నల్లబ్యాగుతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ రేవంత్‌రెడ్డి కేసు కూడా ఇదే ఏసీబీ పరిధిలో పెండింగ్‌లో ఉన్నది. ఇద్దరిపైనా ఏసీబీ కేసులున్న నేపథ్యంలో దోషులెవరో, నిర్దోషులెవరో తేల్చేందుకు జడ్జి సమక్షంలో లై డిటెక్టర్ టెస్టును ఎదుర్కొనే దమ్మూ, ధైర్యం ఈ ముఖ్యమంత్రికి ఉన్నయా?
>
> \- కేటీఆర్

### కేటీఆర్‌కు మళ్లీ ఏసీబీ నోటీసులు

ఫార్ములా ఈ-కార్ రేసులో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంగ్, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ మరోసారి నోటీసులిచ్చింది. ఈనెల 16న విచారణకు రావాలని కోరింది. ఇంతకు ముందు మే 28న కూడా కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు పంపింది. అయితే, తనకు ముందుగానే యూకే, యూఎస్‌ఏలో పలు ఈవెంట్ల కోసం వెళ్లే ఏర్పాట్లు ఉండటంతో తిరిగి వచ్చిన వెంటనే ఏసీబీ ముందు హాజరవుతానని వారికి రాతపూర్వకంగా కేటీఆర్ తెలియజేశారు. ఇదే కేసులో ఈ ఏడాది జనవరి 3న నోటీసులిచ్చిన ఏసీబీ అదే నెల 6న విచారణకు పిలిచింది. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా కేటీఆర్ ఏసీబీ విచారణకు లాయర్‌తో జనవరి 6న హాజరైతే.. లాయర్‌తో విచారణకు రానివ్వబోమని ఏసీబీ తేల్చి చెప్పింది. దీంతో ఏసీబీ గేటు బయటే.. లిఖితపూర్వకంగా తన సమాధానం రాసి ఇచ్చారు కేటీఆర్. అనంతరం జనవరి 7న హాజరు కావాలని ఏసీబీ మరోసారి నోటీసులిచ్చింది. దీంతో అప్పటికే హైకోర్టులో ఆ కేసు నడుస్తుండటంతో కేసు తేలే వరకూ రానని కేటీఆర్ చెప్పారు. దీంతో జనవరి 8న ఇచ్చిన నోటీసులలో 9న హాజరుకావాలని కోరడంతో జనవరి 9న ఏసీబీ విచారణకు కేటీఆర్ హాజరయ్యారు. మొత్తం 7 గంటల్లో 82 ప్రశ్నలు అడిగారు. ఇదే కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సైతం కేటీఆర్‌ను జనవరి 16న విచారణకు పిలిచింది. ఆయన జనవరి 16న 8 గంటల పాటు ఈడీ విచారణను ఎదుర్కొన్నారు. ఈడీ అధికారులు 40కి పైగా ప్రశ్నలు అడిగినట్టు సమాచారం.

> ఫార్ములా-ఈ రేస్ కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హెచ్‌ఎండీఏ అధికారిక బ్యాంకు ఖాతా నుంచి పారదర్శకంగా, సాధికారికంగా పంపిన 44 కోట్ల రూపాయలు ఇప్పటికీ ఫార్ములా-ఈ సంస్థ అకౌంట్ లోనే ఉన్నయి. వాటిని వెనక్కి రప్పించడం చేతకాని ముఖ్యమంత్రి.. మరోసారి ఏసీబీ ద్వారా నాకు నోటీసులు పంపిండు.
>
> \- కేటీఆర్



యశోద దవాఖానలో పల్లా రాజేశ్వర్‌రెడ్డిని పరామర్శిస్తున్న కేటీఆర్. చిత్రంలో తలసాని శ్రీనివాస్, దాసోజు శ్రవణ్, కల్వకుంట్ల సంజయ్, బాల్క సుమన్, వెంకటవీరయ్య, రాకేశ్‌రెడ్డి

## సాగుపై నిబద్ధత లేదు.. విద్యపై బాధ్యత లేదు!

- **కాంగ్రెస్ పాలనలో తిరోగమనం**
- **బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్ జూన్ 13 (నమస్తేతెలంగాణ): 'సాగునీటి రంగంపై నిబద్ధత లేదు.. విద్యావ్యవస్థపై బాధ్యతే లేదు.. వానకాలం సీజన్ మొదలవుతున్నా రైతు భరోసా అమలుపై ప్రణాళికే లేదు.. పాఠశాలలు ప్రారంభమైనా నిర్లక్ష్యం వీడటం లేదు' అని రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యానికి వ్యవసాయమే కాదు, విద్యావ్యవస్థ కూడా కుంటుపడిందని శుక్రవారం ఎక్స్ వేదికగా విమర్శించారు. పదేండ్ల బీఆర్‌ఎస్ హయాంలో పండుగలా మారిన వ్యవసాయం.. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో మళ్లీ తిరోగమనం వైపు పయనిస్తున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. అరకొర రుణమాఫీ, ఆచూకీ లేని రైతుభరోసా, అందని రైతుబీమాయే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. వెయ్యికిపైగా సంక్షేమ గురుకులాల ఏర్పాటుతో ఎవరెస్ట్ శిఖమంత ఎత్తుకు ఎదిగిన తెలంగాణ విద్యావ్యవస్థ, ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో అనేక అవస్థలు ఎదుర్కొంటున్నదని నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా కేటీఆర్ నమస్తే తెలంగాణలో ప్రచురితమైన 'గురుకులాలకు తాళం' ఇతర పత్రికల్లో ప్రచురితమైన 'రైతు భరోసా ఇంకెప్పుడు' కథనాలను ట్యాగ్ చేశారు.

### ఎమ్మెల్యే పల్లాకు పరామర్శ

కాలుకు ఫ్యాక్చరై సోమాజిగూడ యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని శుక్రవారం కేటీఆర్ పరామర్శించారు. ఆయనతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలను తెలుసుకున్నారు. శస్త్రచికిత్స తర్వాత వేగంగా కోలుకుంటున్నానని కేటీఆర్‌తో పల్లా చెప్పారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ రాజేశ్వర్‌రెడ్డి త్వరగా కోలుకొని తిరిగి ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టాలని ఆకాంక్షించారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీలు శ్రీనివాస్‌రెడ్డి, దాసోజు శ్రవణ్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు ఉన్నారు

## రాజకీయ కక్షతోనే కేటీఆర్‌కు నోటీసులు

- **దృష్టి మళ్లించేందుకే దర్యాప్తు సంస్థల దుర్వినియోగం**
- **ఎన్నిరకాలుగా వేధించినా ప్రశ్నించడం ఆపే ప్రసక్తేలేదు**
- **మాజీ మంత్రి హరీశ్‌రావు**



హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): ఆరు గ్యారెంటీల అమలు, ప్రభుత్వ వైఫల్యాలను అడుగడుగునా ఎండగడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రాజకీయంగా కక్ష సాధించేందుకే ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంలో ఏసీబీ నోటీసులు జారీచేసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే సీఎం రేవంత్‌రెడ్డి దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని, అందులో భాగంగానే కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చారని శుక్రవారం ఎక్స్ వేదికగా విమర్శించారు. రేవంత్ సర్కారు డైవర్షన్ డ్రామాలు నడుపుతూ బీఆర్‌ఎస్‌ను బద్నాం చేసేందుకు యత్నిస్తున్నదని దుయ్యబట్టారు. ఎన్ని చిల్లర ప్రయత్నాలు చేసినా రేవంత్ రాజకీయ అరాచకత్వం విజయం సాధించే ప్రసక్తేలేదని పేర్కొన్నారు. సీఎం డైవర్షన్ పాలిటిక్స్ ప్రజలకు ఇప్పటికే అర్థమయ్యాయని, తగిన సమయంలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

### ఫార్ములా-ఈతో పెరిగిన హైదరాబాద్ ప్రతిష్ఠ

ఫార్ములా-ఈ కారు రేస్‌తో తెలంగాణ ప్రతిష్ఠ పెరిగిందని, పెట్టుబడులు వెల్లువెత్తాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. అమర్‌రాజా లాంటి దిగ్గజ కంపెనీ సైతం తమ ప్లాంట్ల స్థాపనకు ముందుకు వచ్చిందని వివరించారు. '2000 సంవత్సరంలో అప్పటి సీఎం చంద్రబాబు ఫార్ములా-ఈ రేస్ తెచ్చేందుకు విఫలయత్నం చేశారు. కానీ బీఆర్‌ఎస్ సర్కారు, కేటీఆర్ కృషితో తెలంగాణలో ఫార్ములా-ఈ రేస్ నిర్వహించి రాష్ట్రఖ్యాతిని పెంచారు. హైదరాబాద్‌ను ఎలక్ట్రిక్ వాహనాల మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చారు' అని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రతిష్ఠ పెంచిన కేటీఆర్‌కు రేవంత్ సర్కారు నోటిసులిచ్చి ప్రతాపం చూపడం విడ్డూరమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందాల పోటీలు నిర్వహించి రాష్ట్ర పరువు, దేశ ప్రతిష్ఠను మంటగలిపిందని తూర్పారబట్టారు. రేవంత్‌రెడ్డి ఎన్నిరకాలుగా వేధించినా.. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం బీఆర్‌ఎస్ ఆపబోదని స్పష్టంచేశారు.

## లోకం పోకడ




గలగలా గోదారి కదలిపోతుంటేను..
బంగారు ఫ్యాక్టరీలే పండుతాయి..
మురిపాల ముత్యాలు దొర్లుతాయి..!

## వానా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 38.3°c | 25.6°c |
| మెదక్ | 37.1°c | 24.7°c |
| నల్లగొండ | 36.0°c | 23.4°c |
| రంగారెడ్డి | 34.9°c | 22.9°c |
| కరీంనగర్ | 34.0°c | 27.0°c |
| ఖమ్మం | 34.0°c | 26.0°c |
| వరంగల్ | 34.0°c | 25.0°c |
| నిజామాబాద్ | 33.3°c | 25.4°c |
| హైదరాబాద్ | 32.0°c | 23.0°c |
| మహబూబ్‌నగర్ | 31.0°c | 24.0°c |

## కాంగ్రెస్‌వి డైవర్షన్ రాజకీయాలు

- **రాజకీయంగా ఎదుర్కోలేకే కేటీఆర్‌పై కేసులు**
- **మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి**



హైదరాబాద్ జూన్ 13 (నమస్తేతెలంగాణ): పాలన చేతగాకే కాంగ్రెస్ సర్కార్ డైవర్షన్ రాజకీయాలకు తెరలేపిందని మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ప్రజా సమస్యలపై అడుగడుగునా నిలదీస్తున్న కేటీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కొలేకే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏసీబీ నోటీసుల పేరిట ఇబ్బందులు పెట్టాలని చూస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ హామీల అమలును అటకెక్కించిన సర్కారు.. ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలను కేసుల పేరిట ఇక్కట్ల పాల్జేయాలని చూడటం దుర్మార్గమని పేర్కొన్నారు. ఎన్ని కుట్రలు చేసినా ప్రజల తరపున బీఆర్‌ఎస్ పోరాటాన్ని ఆపబోదని తేల్చిచెప్పారు.

## కుట్రతోనే కేటీఆర్‌కు నోటీసులు

- **ఎక్స్ వేదికగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**



హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): రాజకీయ కుట్రలో భాగంగానే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కాంగ్రెస్ సర్కారు మళ్లీ నోటీసులు ఇచ్చిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని శుక్రవారం ఎక్స్ వేదికగా ఆమె తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పాలకులు ఎన్ని కుట్రలు పన్నినా.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతూనే ఉంటామని హెచ్చరించారు. కాంగ్రెస్ సర్కారు కుట్రలు మాని ప్రజాసమస్యలపై దృష్టిపెట్టాలని అన్నారు.

## దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం

- **మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**



హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : ఫార్ములా ఈ కేసులో విచారణకు హాజరు కావాలని ఏసీబీ అధికారులు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఖండించారు. ఏసీబీ ద్వారా మరోసారి నోటీసులు జారీ చేయించడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి సర్కార్ వైఫల్యాలను ఎండగతున్నందుకు కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇచ్చిందని స్పష్టంగా తెలుస్తున్నదన్నారు.

## దృష్టి మళ్లించే కుట్రలు: వద్దిరాజు



పాలనా వైఫల్యాలు, ఇచ్చిన హామీల నుంచి దృష్టి మళ్లించేందుకే కాంగ్రెస్ సర్కారు కేటీఆర్‌పై ఏసీబీ కేసు పేరిట నాటకానికి తెరలేపిందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఒక ప్రకటనలో విమర్శించారు. ఫార్ములా-ఈ రేస్ కేసులో ఇప్పటికే సుదీర్ఘంగా విచారించిన అవినీతి నిరోధక శాఖ అధికారులు మళ్లీ నోటీసులు ఇవ్వడంలోని అంతర్యమేమిటని ప్రశ్నించారు. ఫార్ములా-ఈ తెచ్చి తెలంగాణ ప్రతిష్ఠను అంతర్జాతీయ స్థాయికి చేర్చిన కేటీఆర్‌పై కుట్రలు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇలాంటి తప్పుడు కేసులతో వెనక్కితగ్గేది లేదని ఉండదని స్పష్టంచేశారు.

## ప్రశ్నించడాన్ని ఆపలేరు: పల్లె రవి



ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఏసీబీ నోటీసులతో కట్టడి చేయలేరని కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ ఓ ప్రకటనలో తేల్చిచెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డికి పాలన చేతగాక అరాచకాలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

## రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు

- **మరో ఐదురోజులు జోరు వానలు**
- **పలు జిల్లాలకు ఐఎండీ ఎల్లో అలర్ట్**

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతుండడం, బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. హైదరాబాద్‌లో ఉరుములు, మెరుపులతో వానపడింది. పలుప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని చాలా ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసినట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటనలో పేర్కొంది. మరో ఐదురోజులు మోస్తరు నుంచి భారీవర్షాలు కొనసాగుతాయని, పలు జిల్లాలకు ఎల్లోఅలర్ట్ జారీ చేసింది.

## సింగరేణిలో సమస్యలపై దశలవారీగా ఉద్యమాలు

- **టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి**

యైటింక్లయిన్‌కాలనీ జూన్ 13: సింగరేణిలో కార్మిక సమస్యలు పేరుకపోవడంతో కార్మికులు అవస్థలు పడుతున్నారని, వీటిపై దశలవారీగా ఉద్యమాలు చేపడుతామని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లాలోని ఆర్జీ-2 పరిధిలో వకీలుపల్లి గనిలో డివిజన్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన గేట్ మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మిక సమస్యలు పరిష్కరించడంలో గుర్తింపు, జాతీయ సంఘాలు మూగబోయాయని విమర్శించారు. టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉన్న కాలంలో తొలి సీఎం కేసీఆర్ సహకారంతో లాభాల వాటాను 16నుంచి 32 శాతానికి పెంచారని తెలిపారు.

# రెవెన్యూ సదస్సు బహిష్కరణ

- **ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దయ్యే వరకు సమష్టిగా ఆందోళన కొనసాగిస్తాం**
- **పెద్ద ధన్వాడ గ్రామస్థులు, రైతులు**

అయిజ, జూన్ 13 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం పెద్ద ధన్వాడలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును స్థానికులు, రైతులు బహిష్కరించారు. గ్రామంలోని రైతు వేదిక వద్దకు శుక్రవారం ఉదయం 10:30 గంటలకు తహసీల్దార్ రామ్మోహన్ ఆధ్వర్యంలో అధికారులు చేరుకున్నా రైతులెవరూ హాజరుకాలేదు. కొద్దిసేపటి తర్వాత కొందరు వచ్చి సదస్సును బహిష్కరిస్తున్నట్టు వినతిపత్రం అందజేశారు. ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలంటూ శాంతియుత పోరాటం చేస్తున్నవారిపై కంపెనీ యాజమాన్యం, బౌన్సర్లు, పోలీసులతో కలిసి రెచ్చగొట్టేలా భయభ్రాంతులకు గురిచేశారని చెప్పారు. పోరాటం ఆపబోమని స్పష్టంచేశారు.



గద్వాల జిల్లా పెద్ద ధన్వాడలో భూభారతి రెవెన్యూ సదస్సును బహిష్కరించిన రైతులు, గ్రామస్థులు

### భూమికి పరిహారం చెల్లించాలని..



గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో కోల్పోతున్న భూమికి పూర్తి పరిహారం చెల్లించాలని మహబూబాబాద్ జిల్లా అయ్యగారిపల్లిలో రైతు నూకల రవి కుటుంబ సభ్యులు రోడ్డు పనులను శుక్రవారం అడ్డుకున్నారు. పనులు ఆపకపోవడంతో రవి పురుగుల మందు డబ్బాతో విద్యుత్ స్తంభం ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. ఆర్‌ఐ రవికుమార్, ఏఎస్సై వెంకన్న సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్తంభం ఎక్కిన రైతుతో వారు మాట్లాడగా పరిహారం చెల్లిస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశాడు. టవర్ కింద రైతు తల్లి ఉప్పలమ్మ, భార్య రజిత, కొడుకు వంశీకృష్ణ ఆందోళనకు దిగారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కురవి సబ్ డివిజన్ నాయకుడు సామ పాపయ్య తదితరులు ఘటనా స్థలానికి వచ్చి పరిహారం అందే వరకు పోరాటం చేస్తామని చెప్పగా నూకల రవి టవర్ దిగాడు. -కురవి

### యూరియా ఉన్నా.. పడిగాపులేనా!

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి విశాల సహకార సంఘం పరిధిలోని వెల్లుల్లకు గురువారం లారీలో యూరియా బస్తాలు వచ్చాయి. వాతావరణం సరిగా లేదంటూ సహకార సిబ్బంది యూరియాను గోదాంలో భద్రపరిచారు. శుక్రవారం ఉదయం రెండు లారీల నిండా యూరియా బస్తాలు వచ్చాయి. దీంతో తమకు యూరియా బస్తాలు అందుతాయో లేదోనని ఆందోళన చెందిన రైతులు ఒక్కసారిగా సహకార సంఘం గోదాం వద్దకు చేరుకోవడంతో క్యూలో నిల్చోవాలని సిబ్బంది తెలిపారు. క్యూలో నిల్చునే ఓపిక లేకపోవడంతో రైతులు తమవెంట తెచ్చుకున్న ఆధార్‌కార్డులు, పట్టా పాస్‌బుక్‌ల జిరాక్స్‌లను వరుసలో ఉంచి యూరియా కోసం వేచిచూశారు. -మెట్‌పల్లి



### 20 రోజులైనా వడ్ల పైసలివ్వరా?



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి 20 రోజులైనా డబ్బులు ఖాతాల్లో జమ చేయలేదని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నిర్మల్ జిల్లా భైంసా మండలం కుంసరలో రైతులు నిరసనకు దిగారు. వానకాలం సాగుకు విత్తనాలు, ఎరువులు ఇతర ఖర్చులకు ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామంలో ఇంకా 100 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనాల్సి ఉన్నా ఇప్పటివరకూ లారీలు పంపించలేదని తెలిపారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులను అడిగితే కనీసం సమాధానం చెప్పడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుతం పంట పెట్టుబడికి పైసలు లేక అవస్థలు పడుతున్నామని, వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, వడ్ల పైసలను ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. -భైంసా టౌన్

# మైనర్లకు బ్యాంకు అకౌంట్లు ఎలా?

- **ఇచ్చినా నిధులను విద్యార్థులు డ్రా చేసేదెలా?**
- **నేరుగా కాస్మొటిక్ చార్జీల చెల్లింపు సాధ్యమా?**
- **ఇప్పటికే ప్రిన్సిపాళ్ల బ్యాంకు ఖాతాల్లోకి జమ**
- **డ్రా చేసి విద్యార్థులకు అందజేసిన ప్రిన్సిపాళ్లు**
- **ఇక విద్యార్థులకే చెల్లించాలని సర్కార్ నిర్ణయం**

హైదరాబాద్, జూన్13 (నమస్తే తెలంగాణ): ఇంటర్మీడియట్, ఆలోపు చదివే విద్యార్థులందరూ మైనర్లే. హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు ఇచ్చే కాస్మొటిక్ చార్జీలను ఇప్పటివరకు హాస్టళ్ల నిర్వాహకులే చెల్లించేవారు. ఈ ఏడాది నుంచి విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లోనే కాస్మొటిక్ చార్జీల నగదును వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ, మైనర్ విద్యార్థులకు బ్యాంకు ఖాతాలు ఎవరిస్తారు? ఒకవేళ ఇచ్చినా హాస్టల్ విద్యార్థులు ఎలా బయటకు వెళ్లి ఆ నగదును డ్రా చేసుకుంటారు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సర్కారు తీసుకున్న ఈ నిర్ణయంపై విద్యార్థి సంఘాలు తీవ్ర అసహనం వ్యక్తంచేస్తున్నాయి. నేరుగా నగదు బదిలీ అంటూ ఊదరగొడుతూ కాస్మొటిక్ చార్జీలకుఎగనామం పెట్టేందుకే కాంగ్రెస్ ఈ నిర్ణయం తీసుకున్నదని విద్యార్థి సంఘాలు అనుమానం వ్యక్తంచేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ కలిపి మొత్తంగా 1,022 గురుకులాలు, 450కి పైగా కస్తూర్బాగాంధీ, సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు కొనసాగుతున్నాయి. ఆయా హాస్టళ్ల అన్నింటిలో కలిపి దాదాపు 6 నుంచి 8 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం నెలవారీగా హెయిర్ కటింగ్, సోప్స్ తదితరాల కోసం కాస్మొటిక్స్ చార్జీలను వారి తరగతి, వయసు ఆధారంగా చెల్లిస్తుంది. ఇప్పటివరకు ఈ కాస్మొటిక్ చార్జీలను సదరు గురుకుల ప్రిన్సిపాళ్ల, హాస్టల్ వార్డెన్ల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఆ మొత్తాన్ని డ్రాచేసి విద్యార్థులకు పంపిణీ చేయడం ఏండ్లుగా కొనసాగుతూ వస్తున్నది. ఈ ఏడాది నుంచి కాస్మొటిక్ చార్జీలను నేరుగా విద్యార్థుల ఖాతాల్లోనే జమ చేయాలని సర్కారు నిర్ణయించింది. అందుకోసం నెలాఖరునాటికి బ్యాంకు ఖాతాలు తీయించాలని ఆదేశాలు జారీచేసింది.

### అకౌంట్లు తెరుస్తారా?

ఇంటర్ వరకు విద్యార్థులందరూ దాదాపు 18 ఏండ్లలోపు వారే. వారందరూ మైనర్లే. బ్యాంకులు మైనర్లకు ఖాతాలు ఇవ్వడం లేదు. గార్డియన్ పేరిట ఇవ్వడం పరిపాటి. ఒకవేళ ప్రభుత్వం బ్యాంకులతో సంప్రదించింది ప్రత్యేక క్యాటగిరీ కింద విద్యార్థులతో జీరో బ్యాలెన్స్ అకౌంట్లను తెరిపించినా కూడా వాటిని మైనర్ విద్యార్థులు ఎలా నిర్వహించగలరు అనేది మరో ప్రశ్న. బ్యాంకులో జమ చేస్తే నగదును డ్రా చేయాలంటే విద్యార్థులు మళ్లీ బయటకు వెళ్లాల్సిందే. హాస్టల్ విద్యార్థులను ఎవరు తీసుకెళ్తారు? అని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేస్తున్నాయి.

- 3 తరగతి నుంచి 7వ తరగతి వరకు (11ఏండ్లలోపు) విద్యార్థినులకు నెలకు రూ.200
- 8 తరగతి నుంచి 10, ఆపై తరగతి వరకు (11ఏండ్లుపైడిన) విద్యార్థినులకు నెలకు రూ.275
- 3 తరగతి నుంచి 7వ తరగతి వరకు (11ఏండ్లలోపు) విద్యార్థులకు నెలకు రూ.150
- 8 తరగతి నుంచి 10, ఆపై తరగతి వరకు (11ఏండ్లుపైడిన) విద్యార్థులకు నెలకు రూ.200

## రైతులెవరూ నన్ను కలవలేదు: కలెక్టర్

హైదరాబాద్, జూన్13 (నమస్తే తెలంగాణ): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో రైతులెవరూ తనను కలవలేదని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. వరి కోనుగోళ్ల సమస్యలను తనకు చెప్పుకునేందుకు వచ్చిన రైతులతో వరి ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించినట్టు ప్రత్రికల్లో వచ్చిన వార్తల్లో నిజం లేదని ఆయన పేర్కొన్నారు.

